

**సర్వాంగ సుందరంగా నూకపెల్లి కేసీఆర్ కాలనీ**

జగిత్యాల పట్టణ ప్రాంత నిరుపేదలకు సొంతింటి కల నిజం కాబోతున్నది. దాదాపు రూ.300 కోట్లతో 4,520 డబుల్ బెడ్‌రూం ఇండ్లను రాష్ట్ర ప్రభుత్వం నూకపెల్లిలో నిర్మించింది. ఈ కాలనీని మంగళవారం మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్ ప్రారంభించనున్నారు. ఎంపిక చేసిన 3,722 మంది లబ్ధిదారులకు ఇండ్ల పత్రాలను అందజేయనున్నారు.



**బాన్సువాడలోని డబుల్ బెడ్‌రూం ఇండ్లు**

డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాల్లో రాష్ట్రంలోనే కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గం ప్రత్యేకతను సాధించింది. అత్యధిక ఇండ్ల నిర్మాణాలతో కేరాఫ్‌గా మారుతున్నది. ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు 11 వేల ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో 10 వేల ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

# కేసీఆర్ కలల సౌధాలు

## నిరుపేదల ఆత్మగౌరవానికి ప్రతీకలు

### గ్రేటర్ హైదరాబాద్‌లో అట్టహాసంగా మూడో విడత డబుల్ ఇండ్ల పంపిణీ

### 19,020 ఇండ్ల పట్టాలను లబ్ధిదారులకు అందించిన తెలంగాణ ప్రభుత్వం

### హాజరైన మంత్రులు, జీహెచ్‌ఎంసీ మేయర్

### డబుల్ ఆనందంలో లబ్ధిదారులు

*నిరుపేదల ఆత్మగౌరవానికి కేసీఆర్ కలల సౌధాలైన డబుల్ బెడ్‌రూం ఇండ్లే నిదర్శనమని మంత్రులు స్పష్టం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మూడో విడత డబుల్ ఇండ్ల పత్రాలను సోమవారం లబ్ధిదారులకు మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు అందజేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, చామకూర మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, మహమూద్ అలీ, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌తోపాటు జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 19,020 మంది లబ్ధిదారులకు ఇండ్ల పత్రాలను స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందజేశారు. జీహెచ్‌ఎంసీలో తొమ్మిది నియోజకవర్గాల పరిధిలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహించింది. గ్రేటర్‌లో నిర్మించిన లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లను దశలవారీగా పంపిణీ చేస్తుండగా.. తొలి విడదల 11,700, రెండో విడతలో 13,200 ఇండ్లను లబ్ధిదారులకు అందజేశారు. మూడో విడతలో ఇండ్ల పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ఆనందంతో ఉబ్బితబ్బిబయ్యారు.*

- హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ



### పేదలకు వరం: డిప్యూటీ స్పీకర్ పద్మారావు

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు పేదలకు వరమని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో కలిసి పద్మారావుగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నయా పైసా ఖర్చు లేకుండా ప్రతి పేదవాడికి డబుల్ బెడ్‌రూం ఇంటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, పని చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు తప్పకుండా ఆదరించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన ఇండ్లను అమ్ముకోవద్దని సూచించారు.

### సంక్షేమంలో ఆదర్శం: మంత్రి మహమూద్ అలీ

దేశానికి స్వాతంత్ర్యం గాంధీ తీసుకువస్తే.. ఉనికిని కోల్పోతున్న తెలంగాణకు సీఎం కేసీఆర్ ఉద్యమాలతో ఊపిరి పోసి మరో గాంధీలా నిలిచారని హోం మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్‌లో ఏర్పాటు చేసిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీలో ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి మంత్రి లబ్ధిదారులకు ఇండ్ల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ.. మరో లక్ష ఇండ్లను వచ్చే ఎన్నికల తర్వాత నిర్మించాలని సీఎం కేసీఆర్‌ను కోరుతామని చెప్పారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలతో అన్ని రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తున్నదని వెల్లడించారు.



## విపక్షాల విమర్శలు పసలేనివి

- కొల్లూరులో ఇండ్ల పంపిణీలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సంగారెడ్డి, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లోని పేదల కోసం మరో లక్ష ఇండ్లు నిర్మిచేందుకు సీఎం కేసీఆర్ సిద్ధంగా ఉన్నారని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ రూ.9,600 కోట్లతో సకల సౌకర్యాలతో లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించి పేదలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. తెలంగాణ తరహాలో దేశంలో ఎక్కడైనా కేంద్ర ప్రభుత్వం కానీ, రాష్ట్ర ప్రభుత్వాలు కానీ డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించినట్టు చూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. సంగారెడ్డి జిల్లా కొల్లూరు టౌన్‌షిప్‌లో డబుల్ బెడ్‌రూం ఇండ్లను సోమవారం మంత్రి తలసాని పంపిణీ చేశారు. పటాన్‌చెరు సహా హైదరాబాద్‌లోని ఎనిమిది నియోజకవర్గాలకు చెందిన 6,067 మందికి ఇండ్ల పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీలోని పేదలు కిరాయి ఇండ్లలో ఉండొద్దని, ప్రతి ఒక్కరూ సొంత ఇంటిలో ఉండాలన్నది సీఎం కేసీఆర్ సంకల్పం అని వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారన్నారు. ఇవేమీ పట్టని విపక్షాలు చిల్లర విమర్శలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల పక్షపాతి కేసీఆర్‌కు ప్రజలు అండగా నిలిచి, మళ్లీ సీఎంను చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, దానం నాగేందర్, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



కొల్లూరు టౌన్‌షిప్‌లో లబ్ధిదారుతో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, దానం నాగేందర్ తదితరులు




### కేసీఆర్‌ను ఆశీర్వదించండి: మంత్రి పట్నం

సంక్షేమంలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని గనులు, భూగర్భవనరుల, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల నియోజకవర్గం శంకర్‌పల్లి మండలంలో 1,512 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి మంత్రి డబుల్ ఇండ్ల పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి వ్యక్తికి, కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకం అందేలా చూసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందని చెప్పారు. ఇచ్చిన హామీలు నెరవేర్చామని, మరోమారు సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించాలని కోరారు.




### పేదల సొంతింటి కల సాకారం: మంత్రి సబిత

పేదల సొంతింటి కలలను సాకారం చేసి ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల పక్షాన నిలుస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మన్‌సాన్‌పల్లిలో జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి లబ్ధిదారులకు ఇండ్ల పత్రాలను అందజేశారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరుతున్నాయని, తెలంగాణను అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోతున్నారని కొనియాడారు. దేశంలో ఏ రాష్ట్రలో లేనివిధంగా నయా పైసా ఖర్చు లేకుండా పేదలకు ఆత్మగౌరవ సౌధాలను అందిస్తున్నారని తెలిపారు. మహేశ్వరంలో 2,099 మందికి ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు.

### పైసా భారం మోపలేదు: మేయర్ విజయలక్ష్మి

జీహెచ్‌ఎంసీలోని 24 నియోజకవర్గాల పరిధిలో లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లను రూ.10 వేల కోట్లతో ప్రభుత్వం నిర్మించిందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి చెప్పారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని నార్సింగి, బైరాగిగూడలో నిర్మించిన డబుల్ ఇండ్లను ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తోపాటు లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించడమే ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పమని, నయా పైసా భారం మోపకుండా పేదలకు ఇండ్లను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు.



### ప్రజలంతా కేసీఆర్ వెన్నంటే: ఎమ్మెల్యే మంచిరెడ్డి

పేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించేలా సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టారని రంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి వెల్లడించారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లో నిర్మించిన 180 డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ గుప్తతో కలిసి ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం కేసీఆర్ వెన్నంటే ప్రజలంతా ఉన్నారని, పని చేసే ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు.



### డబుల్ ఇండ్లు కేసీఆర్ ఘనతే: మంత్రి మల్లారెడ్డి

నిరుపేదలకు రూ.35 లక్షలకు పైగా విలువ చేసే ఇండ్లను కట్టించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పేర్కొన్నారు. దేశంలో ఇలాంటి పథకం మరెక్కడా లేదని స్పష్టంచేశారు. మేడ్చల్ జిల్లాలోని రెండు ప్రాంతాల్లో జరిగిన డబుల్ ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఎల్బీనగర్, మలక్‌పేట్, చార్మినార్ నియోజకవర్గాలకు చెందిన 3,214 మంది లబ్ధిదారులకు రాంపల్లిలోని ఇండ్ల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డబుల్ ఇండ్ల పంపిణీ నిరంతరం కొనసాగుతుందని, అర్హులందరికీ ఇండ్లను ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు.



## లక్షా ఆరు వేల మందికి గృహలక్ష్మి

- వేగం పుంజుకున్న పథకం
- 10 లక్షల మంది అర్హుల గుర్తింపు
- దశలవారీగా 4 లక్షల మందికి లబ్ధి


హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): సొంత స్థలం ఉన్నవారికి ఇల్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు ఉద్దేశించిన గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాల పంపిణీ ఊపందుకున్నది. రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో మంజూరు పత్రాల పంపిణీ చురుకుగా సాగుతున్నది. సోమవారం వరకు లక్షా ఆరు వేల పైచిలుకు అర్హులకు ఈ పథకాన్ని మంజూరుచేశారు. దశలవారీగా మొత్తం నాలుగు లక్షల మందికి మంజూరు పత్రాలు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసే ఉద్దేశంతో ప్రభుత్వం ఓ వైపు డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకాన్ని అమలుచేస్తూనే, మరోవైపు సొంత స్థలం ఉన్నవారు తమ ఇష్టమొచ్చిన విధంగా ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం చేసేందుకు గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఒక్కో నియోజకవర్గంలో 3 వేల మంది చొప్పున రాష్ట్రంలో మొత్తం 4 లక్షల మందికి లబ్ధిచేకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కోసం ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో రూ.12,000 కోట్లు కేటాయించింది. గత నెల 10వ తేదీవరకు దరఖాస్తులను స్వీకరించిన అధికారులు, వాటి పరిశీలించి ప్రాథమికంగా అర్హుల జాబితాలను సిద్ధంచేశారు. 15 లక్షల పైచిలుకు దరఖాస్తులు రాగా, అందులో 10 లక్షలకుపైగా అర్హులను గుర్తించారు. ఇందులో సోమవారం నాటికి లక్షా ఆరు వేల మందికి పథకాన్ని మంజూరు చేశారు. ఇందులో అత్యధికంగా జగిత్యాల నియోజకవర్గంలో 8,000 మందికి మంజూరు కాగా, ఖమ్మం, సంగారెడ్డిలలో 7 వేల పైచిలుకు, హైదరాబాద్, కామారెడ్డి, నల్లగొండ నియోజకవర్గాల్లో 6 వేలకుపైగా దరఖాస్తుదారులకు మంజూరు చేశారు. నియోజకవర్గాల వారీగా ఎంపికైన అర్హులకు మంజూరు పత్రాలను అందజేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన ఆలస్యం కావడంతో మంజూరులో కూడా కొంత జాప్యం జరుగుతున్నదని అధికారులు చెప్పారు. క్షేత్రస్థాయి అధికారుల పరిశీలన తరువాత జిల్లా మంత్రి, కలెక్టర్ ఆధ్వర్యంలోని పరిశీలన కమిటీ లబ్ధిదారులను ఎంపికచేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రాధాన్యం కల్పించాలని నిర్ణయించారు. ఎంపికైన దరఖాస్తుదారులకు మూడు దశల్లో రూ.3 లక్షలు వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారు. ఎంపికైన లబ్ధిదారులకు ఇప్పటికే మంజూరు పత్రాలను అందజేస్తున్నారు. త్వరలోనే ఒక్కో నియోజకవర్గానికి 3 వేల మంది చొప్పున మొత్తం 3,65,975 మందిని గుర్తించే ప్రక్రియ పూర్తిచేసి మంజూరు పత్రాలు పంపిణీ చేస్తామని అధికారులు వెల్లడించారు. మిగిలిన 35 వేలు సీఎం కోటా కింద మంజూరుచేస్తారని తెలిపారు.



కామారెడ్డి జిల్లా బాన్సువాడలో 283 మంది గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాన్సువాడ నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు ఉండాలన్నదే తన లక్ష్యమని స్పష్టం చేశారు

| గృహలక్ష్మి దరఖాస్తుల వివరాలు | |
|---|---|
| మొత్తం ఇండ్ల లక్ష్యం | 4,00,000 |
| మొత్తం కేటాయింపు అంచనా | 3,65,975 |
| సీఎం కోటా కింద మంజూరు | 34,025 |
| వచ్చిన దరఖాస్తులు | 15,58,610 |
| ఇప్పటివరకు మంజూరు | 1,06,814 |
| అర్హతగల దరఖాస్తులు | 10,82,629 |

- ఘనంగా గాంధీ జయంతి



గాంధీ జయంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని బాపూ ఘాట్‌లో నివాళి అర్పిస్తున్న బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు